## కథ



# శిక్షకి రాయే

## నక్కల ప్రభాకర్ రెడ్డి

వళ్ళంతా కారం పూసినట్లుంది జడ్జిగారికి.

కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ 'నేను చెప్పేది జాగ్రత్తగా విని మళ్ళీ వ్రాయి'' అన్నారు జడ్జిగారు.

'సరే... చెప్పు' అంటూ చేతిలో వున్న డస్టర్‌తో బోర్డులో రాస్తున్నది చెరిపేసి మళ్ళీ రాసేందుకు సిద్ధమయ్యాడు జగ్గడు.

''జా...తి...పి...త'' అని వ్రాయి అన్నారు జడ్జిగారు ఒక్కొక్క అక్షరాన్నే ఒత్తిపలుకుతూ.

జగ్గడు ఓపిగ్గా ఆలోచిస్తూ ఒక్కొక్క అక్షరాన్ని రాశాడు 'జతిపీత' అని. దాన్ని చూసిన జడ్జిగారికి తిక్కరేగింది. జాతిపితను జతిపీతగా మార్చినందుకు ఆరు సంవత్సరాలకు తక్కువ కాకుండా జైలుశిక్ష వేయాలనిపించింది – శిక్ష రాసిన జగ్గడికి కాదు – వాడికి పది సంవత్సరాలుగా పాఠాలు చెప్పిన అయ్యవార్లకు.

***

సాంబయ్య వేసిన కేసు చూసి జడ్జిగారికి నవ్వొచ్చింది మొదట.

'ఎవరైనా తమ అమ్మాయిని రేప్ చేసినపుడో, కట్నంకోసం తన్ని తగలేసినపుడో, రెండో పెళ్ళి చేసుకునో, చిన్నిల్లు పెట్టుకునో మహిళల్ని వేధిస్తున్నప్పుడో – నా కూతురు జీవితాన్ని నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరతారు. నా కొడుకు జీవితాన్ని నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ వచ్చిన సాంబయ్యను చూసి, ఇదేదో సరదా విషయమనీ, అమాయకత్వంతో చేస్తున్న పని అనీ అనుకున్నారు జడ్జిగారు.

కానీ సాంబయ్య పూర్తి విషయాలు చెప్పిన తరువాత ఇదేదో వెరైటీ కేసులా గుందే అనుకున్నారు.

దాంతో 'మీ అబ్బాయిని పిలిపించండి. నేను నేరుగా మాట్లాడి కేసు స్వీకరిం

చవచ్చో లేదో చెబుతాను' అన్నారు జడ్జిగారు.

సాంబయ్య తన పద్దెనిమిదేళ్ళ కొడుకు జగ్గడ్ని తీసుకువచ్చి జడ్జిగారి ముందర నిలబెట్టారు.

వాడు వచ్చీరాగానే ''ఈడికి వస్తే పది రూపాయ లిస్తానంటివి గదా. ఈ...'' అన్నాడు చేయిచాస్తూ వాళ్ళ నాన్నని.

''జడ్జిగారు అడిగిన వాటికి సమాధానం చెప్పు. అప్పుడు ఇస్తాను'' అన్నాడు సాంబయ్య.

ఆ మాటతో జగ్గడు జడ్జివైపు తిరిగి ''నువ్వేనా జడ్జంటే?'' అన్నాడు నిర్లక్ష్యంగా.

తన ఇరవై ఏళ్ళ సర్వీసులో ఎప్పుడూ కనీవినీ ఎరుగని ఆ సంబోధన విని జడ్జిగారికి దిమ్మతిరిగిపో యింది.

తల ఒక్కసారి విదిల్చి ''ఎవరితో మాట్లాడుతు న్నావో తెలుసా. అతిగా మాట్లాడావంటే బొక్కలో తోయిస్తాను'' అన్నారు జడ్జిగారు ఆగ్రహంగా.

''వీడేం పెద్ద పుడింగా బొక్కలో వేసేదానికి'' అన్నాడు జగ్గడు ఏమాత్రం జంకకుండా, వాళ్ళ నాన్నతో.

''అవున్రా, జడ్జిగారే శిక్షలు వేసేది. సారనుకుంటే పోలీసుల్ని పిలిపించి నీ కాళ్ళు విరగ్గొట్టించేస్తారు జాగ్రత్త'' అన్నాడు సాంబయ్య.

నిజమేనా? అన్నట్లు సందేహంగా చూశాడు జగ్గడు.

ఎగదన్నుకొస్తున్న కోపాన్ని అణుచుకుంటూ ''నేను చెప్పింది ఈ బోర్డులో వ్రాయి'' అని చాక్‌పీస్ ఇచ్చి బోర్డు చూపించారు జడ్జిగారు.

''నేను రాయనుపో'' అని అనబోయిన జగ్గడు, అప్పుడే పోలీస్ కానిస్టేబుల్ ఒకడు లోపలికి వస్తుం డడం చూసి గుడ్లు మిటకరించి జడ్జిగారి వైపు చూసి, బోర్డు దగ్గరికి నడిచాడు అయిష్టంగా.

''జడ్జి అని వ్రాయి'' అన్నారు జడ్జిగారు.

చకచకా బోర్డులో కెలికాడు జగ్గడు – ''జిడ్డుజి'' అని. దాన్ని చూసి ఎగిరటపడ్డారు జడ్జిగారు.

''ఏం రాశావో చదువు'' అన్నారు ఉరిమిచూస్తూ.

''నువ్వు చెప్పిందే రాశాను'' అన్నాడు జగ్గడు తిమురుగా.

''రేయ్. ఎంత పొగర్రా నీకు. జడ్జిగారిని పట్టుకుని 'నువ్వు' అని అంటావా'' అంటూ లాఠీతో పిర్రమీద ఒక్కటిచ్చాడు కానిస్టేబుల్.

''అబ్బా...'' అని పిర్రని తుడు ముకుంటూ 'ఇంకేమనల్ల' అన్నాడు జగ్గడు.

''మీరు అని గౌరవంగా సంబో ధించాలి. ప్రతిమాట వెనుకా 'సార్' అని చెప్పాలి'' చెప్పాడు కానిస్టే బుల్.

''సరే...'' అనేసి, అంతలోనే నాలుక్కరుచుకుని 'సార్' అని దానికి కలిపాడు జగ్గడు.

''అది సరేగానీ 'సైన్స్' అని వ్రాయి'' అడిగాడు జడ్జిగారు చిరాగ్గా.

జగ్గడు గబగబా రాశాడు 'స యించు' అని.

***

కోర్టు హాలు నిశ్శబ్దంగా ఉంది. హాల్లో జగ్గడికి పాఠం చెప్పిన అయ్యవార్లు, వారి ఎం.ఇ.వో, డి.ఇ.వో, ఇంకా పత్రి కల వాళ్ళూ కూచుని వున్నారు.

ముందుగా సైన్స్ టీచర్‌ని రమ్మని బోర్డులో వున్న వాటిని చదవమని చెప్పారు జడ్జిగారు.

బోర్డులో ఉన్నదాన్ని చకచకా చదివాడు సైన్స్ టీచర్ – ''కారు బండ ఆకిసూడు'' అని.

''అంటే ఏమిటి?'' అడిగారు జడ్జిగారు.

సైన్స్ టీచర్ ఒక నిమిషం ఆలోచించి ''కారు బండి ఆగింది చూడండి'' అని గానీ, 'కారు బండి ఆపి చూడు' అని గానీ అర్థమవుతోంది సార్'' అన్నాడు వినయంగా.

''సరే.. సరే రెండవది చదవండి'' అడిగాడు జడ్జి గారు.

''అమలజానీ!'' చదివాడు సైన్స్ టీచర్.

''అంటే ఏమిటి!'' అడిగాడు జడ్జిగారు.

''అమల అంటే హీరో నాగార్జున భార్య సార్, జానీ అంటే పవన్ కళ్యాణ్ సార్'' అన్నాడు సైన్స్ టీచర్, తన సినిమా నాలెడ్జి ఇలా ఉపయోగపడినం దుకు సంతోషిస్తూ.

''ఓహో అలాగా, సరే ఇంకొకటుంది. అది కూడా చదివేయండి'' అన్నారు జడ్జిగారు.

''శివసకిరాయే'' గబగబా ఉత్సాహంగా చది వాడు సైన్స్ టీచర్.

''అంటే?'' అడిగారు జడ్జిగారు.

''శవమైన సఖీ అంటే చనిపోయిన ప్రియురాలా... లేచి రా'' అని అర్థమవుతోంది సార్'' అన్నాడు.

ఇక మీరెళ్ళవచ్చు అని చెప్పడంతో సైన్స్ టీచర్, తన గండం గడిచినట్లేనని సంబరపడుతూ వచ్చి కూర్చున్నాడు.

అందర్నీ ఒకసారి పరికించి చూసి, చెప్పడం ప్రారంభించారు జడ్జిగారు.

సైన్స్ టీచర్ చదివింది మీరందరూ విన్నారు కదా. ఆయన చాలా చక్కగా చదివాడు. చక్కగా అర్థాన్ని వివరించాడు. మీరందరూ కూడా ఆయన చదివిన దాంతో, చెప్పినదానితో ఏకీభవిస్తారని అనుకుంటు న్నాను.

అయితే మీరు అనుకున్నట్లుగా మొదటిది 'కారు బండి ఆగిచూడ్డం' కాదది – 'కార్బన్ డై ఆక్సైడ్'. రెండోది అమలా కాదు, జానీ కాదు – అది 'అమ్ల జని'. ఇక మూడోదాంట్లో శవమూ లేదు, చచ్చిన సఖి రావడమూ లేదు. అది – 'శ్వాసక్రియ' అన్నారు.

అంతే ఒక్కసారిగా హాలు హాలంతా నవ్వులతో నిండిపోయింది. కానీ జడ్జిగారు మాత్రం సీరియస్‌గా చెప్పడం మొదలుపెట్టారు.

''వినడానికి జోక్‌లాగుంది కదా. కానీ ఇది ఒకరి జీవితం నాశనమైపోయిందనడానికి సాక్ష్యం. పదేళ్ళు పాఠం చెప్పిన అయ్యవార్లు, రెండేళ్ళు పాఠం చెప్పిన అధ్యాపకులే నేరస్తులు'' అన్నారు.

అందరి మొహాల్లో నవ్వు పోయి, సీరియస్‌నెస్ వచ్చింది. జడ్జిగారు కొనసాగించారు.

''ఆ అబ్బాయిని చూడండి. ఆ అబ్బాయి పేరు జగన్నాథం. అతడికి చెవుడు లేదు, గుడ్డి లేదు. మాన సిక వైకల్యమూ లేదు. కానీ అతనికి పదేళ్ళపాటు ఇంతమంది అయ్యవార్లూ కలిసి ఏం నేర్పించారో నాకర్థం కావడంలేదు. 'జాతిపిత' అన్న వత్తుల్లేని పదాన్ని సైతం 'జతిపీత'గా రాశాడా అబ్బాయి. ఐదు ప్లస్ ఏడు ఎంత అంటే పదిసార్లు ఆలోచించి పదమూ డంటాడు. 'గాడ్' స్పెల్లింగ్ రాయమంటే డి.ఓ.జి. – డాగ్ అని రాస్తాడు. ఇంతమంది టీచర్లున్నారు. వీళ్ళను తనిఖీ చేయడానికి ఎం.ఇ.ఓ. వున్నారు, అత నిపైన డి.ఇ.వో. వున్నారు. ఒక్కరంటే ఒక్కరి దృష్టిలో కూడా ఈ అబ్బాయి పడలేదా? పడితే దయకలగ లేదా? అరే – అక్షరమ్ముక్క రాకపోతే ఇతని జీవితం నాశనమైపోతుందే అన్న జాలి కలగలేదా?

మీరందరూ చూశారు కదా ఆ అబ్బాయి రాసిన పదాలు. గట్టిగా ఒక పదాన్ని కూడా సరిగ్గా రాయలే కపోయిన ఆ అబ్బాయి ఏడో తరగతి పాసయ్యాడు. పదవ తరగతి కూడా పాసయ్యాడు – అదీ ఫస్ట్‌క్లాస్‌లో. ఇదెలా సాధ్యం?

ఇప్పుడేమో ఇంటర్ ఫెయిల్. ఒక్క సబ్జక్టులో కూడా రెండంకెల మార్కులు రాలేదు. ఇప్పుడు ఆ అబ్బాయి భవిష్యత్ ఏమిటి?

ఈ పన్నెండేళ్ళూ, అతను వాళ్ళ నాన్నతోపాటు వ్యవసాయ పనులకో, పశువులను పోషించడానికో, గొర్రెల పెంపకానికో వెళ్ళున్నా అతను కనీసం బ్రత కడం నేర్చుకునేవాడు. ఇన్నేళ్ళూ పాఠశాలకూ, కళాశా లకూ వెళ్ళడం వల్ల అటు వ్యవసాయానికీ పనికిరా కుండా తయారయ్యాడు. ఇటు చదువులో కొరగా కుండా పోయాడు. పైగా నలుగురితో మాట్లాడే సంస్కారం కూడా నేర్చుకో లేకపోయాడు.

పోనీలే! ఉపాధ్యాయులకు వచ్చే జీతాలు చాలక యూనియన్‌గా వెళ్ళి పోరాటాలు చేయడానికీ, జనాభా లెక్కల సేకరణకీ, పల్స్‌పోలియోకి, ఎలక్షన్ డ్యూటీలకీ... ఇలా చాలా చాలా పనులకే మీ సమయం సరిపో యిందని అనుకుందాం. తీరికలేక వందమందిలో ఏ ఒక్కర్నో ఇద్దర్నో పట్టించుకోలేదనీ, చదువు చెప్పాలని వున్నా చెప్పలేకపోయారనీ అను కుందాం. అయినా మిమ్మల్ని క్షమిం చలేం. ఎందుకంటే... చదువు లేకపో యినా ఆ అబ్బాయి బ్రతికేయగలడు కానీ – సంస్కారం లేకుండా ఎట్లా?''

★

